నమ్మక ద్రోహం చంద్రబాబు నైజం

- హామీలు విస్మరించిన కూటమికి పాలించే అర్హత లేదు
- సూపర్ సిక్స్.. మోసం ఫిక్స్‌గా మారింది
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్
- ప్రభుత్వ పాలన తీరును నిరసిస్తూ భారీ నిరసన ర్యాలీ
- ఎండను సైతం లెక్కచేయక రోడ్డెక్కిన కార్యకర్తలు, నాయకులు
- ఇదే రాజ్యం అంటూ నినాదాలు


ఆర్‌ఐకి వినతి ఇస్తున్న మళ్ల విజయప్రసాద్ తదితరులు


ఆర్టీసీ డిపో వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మళ్ల విజయప్రసాద్


89వ వార్డు కొత్తపాలెం నుంచి బయలుదేరిన దొడ్డి కిరణ్, కార్యకర్తలు

మల్కాపురం: నమ్మిన ప్రజలకు వెన్నుపోటు పొవడటం చంద్రబాబు నైజం.. ఆయన రాజకీయ జీవితంలో ఎన్నడూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసిన చరిత్ర లేదని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం వెన్నుపోటు దినం పేరిట భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా గాజువాక ఆర్టీసీ డిపో నుంచి ములగాడ తహసీల్దార్ కార్యాలయం వరకూ మళ్ల విజయప్రసాద్ నాయకులు,కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లారు. అక్కడ రెవెన్యూ కార్యాలయ అధికారులకు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం పథకాలు అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం మళ్ల విజయప్రసాద్ మాట్లాడారు. కూటమి అధికారం చేపట్టిన ఏడాదిలో హామీలు అమలు చేయకుండానే... అప్పులు భారీగా చేశారన్నారు. ఏడాదిలో 1,51,604 కోట్ల అప్పు చేసి రాష్ట్రాని అప్పుల ఆంధ్రగా మార్చారని దుయ్యబట్టారు.

బాండ్ల సంగతేంటి?

బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో ఇంటింటికీ బాండ్లు పంపిణీ చేసి ప్రజలను నమ్మించిన చంద్రబాబు,పవన్‌కల్యాణ్‌లు నేడు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సంక్షేమపథకాలు అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నిస్తుంటే తప్పుడు కేసులు పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు తల్లికి వందనం పేరిట ఏటా రూ.15 వేలు, ఏడాదిలోనే 20 లక్షల ఉద్యోగులు ఇస్తామని, ఉపాధి లేకుంటే ప్రతి నిరుద్యోగికి రూ. 3 వేల భృతి ఇస్తామని నమ్మించి నేడు ఉన్న ఉద్యోగాలు తీసేస్తున్నారన్నారు.

దమ్మున్న నాయకుడు జగన్

తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన ఆర్నెల్లలోనే నవరత్నాలు పేరిట ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేశారన్నారు. కరోనా వంటి కష్ట కాలంలో కూడా ఎక్కడా ప్రజా సంక్షేమాన్ని విస్మరించలేదని గుర్తు చేశారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రజలను,పార్టీ కార్యకర్తలను నమ్ముకున్నారని.. చంద్రబాబు మాదిరిగా రోజుకో పార్టీతో పొత్తులు పెట్టుకుని పాలన సాగించడం జగన్‌కు చేతకాదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పార్టీ అధికార ప్రతినిధి ఆల్లా కృష్ణ,పార్టీ పశ్చిమ మహిళా అధ్యక్షురాలు పేడాడ జ్యోత్స్న, పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్,బల్లా లక్ష్మణరావు,వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి దొడ్డి కిరణ్, ఎస్సీ సెల్ నాయకులు పూండి మల్లేశ్వరరావు, వార్డు పార్టీ అధ్యక్షులు రేవళ్ల సత్యనారాయణ,జీ.వీ.ఎస్.ఎన్.రాజు (కేబుల్ వాసు),భీశెట్టి గణేష్,గులిగిందల కృష్ణ, చుక్క ప్రసాద్‌రెడ్డి,మహిళ నాయకురాలు చుక్క వరలక్ష్మి,తోనంగి వెంకటరమణి,శ్రీదేవి వర్మ,మళ్ల ధనలత తదితరులు పాల్గొన్నారు.


58వ వార్డు నుంచి తరలి వచ్చిన కార్యకర్తలు,నాయకులు


60వ వార్డు నుంచి భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు

బీసీలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం



హామీలు నమ్మి కూటమికి జిల్లాలో బీసీలు ఓట్లు వేశారు. ఓట్లు వేసిన ప్రతి బీసీని కూటమి నాయకులు మోసం చేశారు.జిల్లాలో అధికంగా ఉన్న యాదవులు,కాపులకు మేయర్,డిప్యూటీ మేయర్ పదవుల్లో స్థానం లేకుండా చేసిన కూటమి పాలకులకు పాలించే అర్హత లేదు.

– జియ్యాని శ్రీధర్, మాజీ డిప్యూటీ మేయర్

నిరుద్యోగులను వంచించారు



కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ప్రతి నిరుద్యోగికి ఉపాధి కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. ఉపాధి కల్పించే వరకు నెలకు రూ 3 వేల భృతి ఇస్తామని నమ్మించారు. నేడు ఆ హామీ అమలు చేయడం లేదు. ఇదేనా కూటమి పాలన తీరు.

– పి.వి.సురేష్ , 60వ వార్డు కార్పొరేటర్

చేత కానప్పుడు హామీలెందుకు?



తాము అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు,తల్లికి వందనం,ఉచిత గ్యాస్ అని హామీలు ఇచ్చి నేడు వాటిని అమలు చేయడం లేదు. అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతూ కూటమి నాయకులు ఆకాశం వైపు దిక్కులు చూస్తున్నారు. చేతగానప్పుడు ప్రజలకు ఎందుకు హామీలు ఇవ్వాలి. ఇదేనా బాబు ష్యూరిటీ.

– పేడాడ జ్యోత్స్న, పార్టీ పశ్చిమ మహిళా అధ్యక్షురాలు

ఎస్సీ, ఎస్టీలకు ఏం చేశారు?



ఏడాది పాలనలో ఎస్సీ,ఎస్టీలకు కూటమి నాయకులు చేసిన మేలు ఏమీ లేదు. దళితులపై దాడులు జరుగుతున్నా కనీసం చంద్రబాబు,పవన్‌కల్యాణ్ స్పందించక పోవడం దారుణం. ఇటీవల తెనాలి ప్రాంతంలో నడి రోడ్డుపై దళితులపై దాడి చేస్తే దానిపై నేటికి వారు స్పందించక పోవడం చూస్తే రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీలకు ఎంత మేలు జరుగుతుందో తెలుస్తుంది.

– బల్లా లక్ష్మణరావు,62వ వార్డు కార్పొరేటర్

ప్రశ్నించే గొంతును నొక్కేస్తున్నారు



కూటమి ప్రభుత్వ పాలన బాగోలేదు. వైఫల్యాలను ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టి కూటమి ప్రభుత్వం వేధిస్తుంది. ఎన్నాళ్లు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయలేరు. ప్రజలు కూటమి నాయకులకు బుద్ధి చెప్పే రోజు వస్తుంది. అప్పుడు ఆ నాయకులు ఏమి సమాధానం చెబుతారో వేచి చూద్దాం.

– ఆల్లా కృష్ణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా శివాలయ ప్రారంభోత్సవం


ఆలయ నిర్వాహకులతో శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలే అవుట్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, లలితా త్రిపుర సుందరీ దేవి, మల్లికార్జున స్వామి వార్ల ఆలయ ప్రారంభోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధ్వజారోహణ , యాగశాల ప్రవేశం మొదలైన పూజా కార్యక్రమాల్లో మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొన్నారు. రానున్న రెండు రోజుల్లో ఆలయంలో దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ట , అన్న సమారాధన వంటి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

చెరకాపు బుజ్జికి పరామర్శ


బుజ్జిని పరామర్శిస్తున్న మళ్ల విజయప్రసాద్, కార్పొరేటర్ పి.వి.సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు చెరకాపు బుజ్జి తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ బుధవారం శ్రీహరిపురంలోని బుజ్జి ఇంటికి పరామర్శించారు.ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. బుజ్జిని పరామర్శించిన వారిలో కార్పొరేటర్లు పి.వి.సురేష్,బల్లా లక్ష్మణరావు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్,ఎస్సీ సెల్ ప్రతినిధి పూండి మల్లేశ్వరరావు,పార్టీ జిల్లా కార్యదర్శి పీలా అనంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వ్యాయామంతో చక్కని ఆరోగ్యం


కార్యక్రమంలో పాల్గొన్న డిపో మేనేజర్ ప్రవీణ

మల్కాపురం: ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా గాజువాక ఆర్టీసీ డిపో వద్ద బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రవీణ మాట్లాడుతూ రక్తపోటు నివారణకు నిత్యం వాకింగ్ చేయాలని, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి ధ్యానం వంటివి చేయాలని సూచించారు. ఎంతటి ఒత్తిడి ఉన్న వాటిని తేలిగ్గా తీసుకోవాలన్నారు. మానసికంగా ఒత్తిడి పెంచుకుంటే రక్తపోటుకు దారితీస్తుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ అధికారులు,డిపో కార్మికులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగా యి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం,శేషవస్త్రాలను అందించారు. అనంతరం గరుడసేవ జరిపించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై కొలువుదీర్చి అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ గొలగాని అప్పారావు

మల్కాపురం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం కార్డన్ సెర్చ్ చేపట్టారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ దృష్ట్యా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని పలు ముఖ్య కూడళ్లలో వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించారు.అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే దూర ప్రాంతాల నుంచి ఇటీవల స్టేషన్ పరిధిలోని నివాసాల్లో అద్దెకు వచ్చిన వారి ఇళ్లను పరిశీలించారు. వారి గుర్తింపు కార్డులు, ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చారో అన్న విషయాలను తెలుసుకున్నారు.

ప్లాస్టిక్‌ను అరికట్టి పర్యావరణాన్ని కాపాడదాం


వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులతో అతిథులు

మల్కాపురం: ప్లాస్టిక్ వినియోగాన్ని కనీస స్థాయికి తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఈ.పి.ఎస్.భాగ్యలక్ష్మి విద్యార్థులకు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధికారులు ధ్రువీకరించిన ప్రకారం ఒకసారి వాడి పారివేయాలని సూచించిన ప్లాస్టిక్ వస్తువులను చాలామంది తిరిగి వినియోగిస్తూ తమ ఆరోగ్యాన్ని చేతులారా పాడు చేసుకుంటున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణకు క్లాత్ సంచులు, పేపర్ బ్యాగ్‌లను వినియోగించాలని సూచించారు. తక్కువ మైక్రాన్ ఉన్న ప్లాస్టిక్ వినియోగం వలన అనర్థాలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా జీవించాలి



ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న మాజీ వీసీ రామకృష్ణారావు, ఆచార్యులు

విశాఖ విద్య: పర్యావరణ హితంగా, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా మానవ జీవన విధానం ఉండాలని కృష్ణా విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ఎస్.రామకృష్ణారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బుధవారం ఏయూ విద్యా విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు వస్తున్నాయని, వాటిని వినియోగించడం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుతం పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు చేయడం సాధ్యపడుతుందని చెప్పారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పర్యావరణానికి ఎదురవుతున్న సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ఆసక్తిదాయకంగా వివరించారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణ హిత జీవనం సాగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సేవ్ ఎన్విరాన్మెంట్ – బ్యాన్ ప్లాస్టిక్ అని నినదించారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ ప్లాస్టిక్‌పై యుద్ధాన్ని చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. గాలి, నీరు, నేల, ధ్వని కాలుష్యాల వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించారు. అనంతరం ఏయూ ఆర్ట్స్ కళాశాల పరిసరాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, బీఈడీ విద్యార్థులు, బీఈడీ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు వయోపరిమితి సడలించాలి

ఎంవీపీకాలనీ: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు వయోపరిమితి ఎత్తేయాలని విదసం నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా పర్యటనలో ఉన్న రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్‌కు బుధవారం ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 5లో అభ్యర్థులకు 50 ఏళ్ల వయోపరిమితి పేర్కొన్నారన్నారు. దీని కారణంగా చాలా మంది రుణాలు పొందేందుకు అనర్హులవుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో రుణాలకు వయోపరిమితిని పూర్తిగా ఎత్తివేయాలని కోరారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జాజి ఓంకార్, గుడివాడ ప్రసాద్, బూల భాస్కరరావు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి అతిథి అధ్యాపకుల సమస్యలు


కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న అతిథి అధ్యాపకులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో పని చేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలపై బుధవారం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ఏయూ అతిథి అధ్యాపకుల అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. నెలవారి జీతాలు, రూల్స్‌కు వ్యతిరేకంగా యూనివర్సిటీలో నియమించిన టీచింగ్ సభ్యులందరినీ పంపించాలని, దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ యూనివర్సిటీలో అమలు జరిగేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.

మహిళలకు నోటిఫికేషన్‌లో రోస్టర్ పాయింట్లను గుర్తించే విధంగా చూడాలని విన్నవించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లుగా అసోసియేషన్ నాయకులు డాక్టర్ ఎం.సురేష్ మీనన్ తెలిపారు. డాక్టర్ దాస్, డాక్టర్ శిరీష్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటులో పుస్తకాల వ్యాపారం

- స్కూళ్లు తెరవకముందే హడావుడి
- ఒకటో తరగతి పుస్తకాలకు రూ.5 వేలు వసూలు
- చోద్యం చూస్తున్న మండల విద్యాశాఖాధికారులు


చంటిపిల్లతోనే క్యూ లైన్‌లో


గోదాం మెట్ల వద్ద కిందకూర్చొని పుస్తకాలు చూసుకుంటున్న తల్లిదండ్రులు

విశాఖ విద్య: గోపాలపట్నం మండలంలోని కొన్ని ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు పుస్తకాలతో కూడా వ్యాపారం చేస్తున్నారు. ఈ ఏడాది ప్రైవేటు స్కూళ్లల్లో అడ్మిషన్లకు డిమాండ్ ఉండడంతో ఇదే అదునుగా వ్యాపార విస్తరణకు కొత్తదారులు వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలోనే స్కూళ్లకు అనుబంధంగా పుస్తకాల విక్రయ దుకాణాలు కూడా తెరుస్తున్నారు. ఎన్ఏడీ సెంటర్‌లోని బుచ్చిరాజుపాలెంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో అడ్మిషన్లు తీసుకున్న వారందరికీ బుధవారం నుంచి పుస్తకాల విక్రయం మొదలుపెట్టారు. స్కూల్‌కు సమీపంలోని ఓ గోదాములో పుస్తకాలు నిల్వ చేసి, అక్కడికి వచ్చి కొనుగోలు చేయాలని సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు గోదాము ముందు క్యూ కట్టారు.

ధరలపై నియంత్రణ ఏదీ

పుస్తకాల కోసం గాలి, వెలుతురు సరిగా లేని గోదాములో గంటల తరబడి వేచి ఉండలేక కొంతమంది తీవ్ర ఇబ్బందిపడ్డారు. ప్రైవేటు స్కూళ్లలో పుస్తకాల విక్రయాలు చేపట్టరాదని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఉన్నప్పటికీ..సర్వంగా అమలు కావడం లేదు. ఒకటో తరగతి విద్యార్థికి రూ.5 వేలు పుస్తకాల కోసం వసూలు చేస్తున్నారు. అదే 9వ తరగతి అయితే రూ.15 వేలు వరకు చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు అంటున్నారు. ఈ రీతిన ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి పుస్తకాలు విక్రయించడంతో సామాన్య,మధ్య తరగతి కుటుంబాల వారికి చదువులు భారమవుతున్నాయి.

చోద్యం చూస్తున్న విద్యాశాఖ

మండల విద్యాశాఖాధికారులు ప్రైవేటు స్కూళ్ల విషయంలో చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. బీఆర్‌టీఎస్ రోడ్‌లో దర్జాగానే పుస్తకాలు విక్రయాలు జరుపుతున్నా విద్యాశాఖాధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం.

గుండెపోటుతో కళాకారుడి మృతి

- బాలకృష్ణ డూప్‌గా ఫేమస్
- శ్రీకాకుళం జిల్లా కంచిలిలో తుదిశ్వాస
- పెదగంట్యాడలో విషాదఛాయలు


కల్యాణ్ (ఫైల్)


కల్యాణ్ మృతదేహం

పెదగంట్యాడ: మండలానికి చెందిన ఓ కళాకారుడు శ్రీకాకుళం జిల్లా కంచిలిలో గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. వివరాలివీ పెదగంట్యాడ మండలం దయాల్‌నగర్, పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా ఉంటున్న చొప్ప కల్యాణ్ (60) స్టేజ్ ప్రోగ్రామ్స్ ఇస్తూ ఉంటారు. అంతేకాకుండా పెదగంట్యాడ జంక్షన్‌లో ప్రింటింగ్ ప్రెస్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు కళారంగంపై విశేష అభిమానం ఉండడంతో వయసు మీద పడినా.. ఆ రంగాన్ని వీడలేదు.. తన అభిమాన నటుడు నందమూరి తారక రామారావు స్ఫూర్తితో కళారంగంలోకి వచ్చారు. చిత్రం భళారే విచిత్రం అనే డ్యాన్స్ ట్రూప్‌ను ఏర్పాటు చేశారు. బాలకృష్ణ డూప్‌గా ఆయన అందరికీ సుపరిచితులు.. అటు శ్రీకాకుళం నుంచి ఇటు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి వరకూ ఉత్సవాలు , పండగల్లో నిర్వహించే డ్యాన్స్ ప్రోగ్రామ్‌లలో బాలకృష్ణ డూప్‌గా డ్యాన్స్ చేస్తూ ప్రేక్షకులను ఉర్రూతలూగించేవారని తోటి కళాకారులు చెబుతున్నారు. ఎక్కడ ఏ కార్యక్రమం ఉన్నా అక్కడకు హాజరయ్యేందుకు ఉత్సాహం చూపేవారన్నారు. అయితే ఈ నెల 3న వజ్రపు కొత్తూరు మండలం, కోమరల్తాడ గ్రామంలో జరిగిన ఉత్సవంలో రాత్రి ప్రోగ్రాం ముగించారు. బుధవారం ఉదయం అక్కడి నుంచి కంచిలి మండలం కంచిలి గ్రామానికి చేరుకున్నారు. కంచిలిలో కూడా ఓ ప్రోగ్రాం చేయడానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం చెరువు వద్దకు వెళ్తుండగా ఓ చెట్టు కింద ఆయన ఆకస్మాత్తుగా పడిపోయారు. దీంతో సహచరులు గమనించారు. అయితే అప్పటికే అతను మృతి చెందారని నిర్ధారించుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడు చొప్ప కల్యాణ్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కాగా కుమారుడు ఇటీవల మృతి చెందాడు. కల్యాణ్ మృతి చెందడంతో పెదగంట్యాడలో విషాదచాయలు అలముకున్నాయి. కల్యాణ్ మృతి కళారంగానికి తీరని లోటని తోటి కళాకారులు అన్నారు. అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వ్యర్థాల తొలగింపు


గెడ్డలో వ్యర్థాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు గోపాలపట్నం ప్రధాన రహదారిలోని గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను జీవీఎంసీ అధికారులు తొలగించారు. వ్యర్థాలమయం అన్న శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురితమైన వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. గెడ్డలో వ్యర్థాలు, పూడికలు తొలగించి వెంటనే తరలించారు. ఇది చూసిన స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించేందుకు సహకరించిన 'సాక్షి'కి అభినందనలు తెలిపారు.